# హెచ్ఎం శ్రీనివాస్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

జన్నారం, సెప్టెంబర్ 5 : అక్కపెల్లి గూడ ప్రాథమిక పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు జాజాల శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. పాఠశాలలో అనేక మంది పిల్లలను చేర్పించినందుకుగాను గురువారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయనకు అవార్డు అందజేశారు. హెచ్ఎం శ్రీనివాస్‌ను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.



మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న జాజాల శ్రీనివాస్


నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 6 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


# పంటలను పరిశీలించిన ఏడీఏ

వేమనపల్లి, సెప్టెంబర్ 5 : ముల్కలపేట, రాచర్ల గ్రామాల శివారులోని పంట పొలాలను భీమిని డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సురేఖ గురువారం పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లోని పంటల పరిస్థితిపై సమీక్షించారు. జూలైలో ప్రాణహిత నది ఉప్పొంగి కల్లెంపల్లి, ముక్కిడిగూడెం, సుంపుటం, వేమనపల్లి, రాచర్ల, ముల్కలపేట గ్రామాల్లోని వందల ఎకరాల్లో పత్తి పంట నీటమునిగిందని, తమను ఆదుకోవాలని రైతులు ఏడీఏను కోరారు. ఇందుకు ఆమె స్పందిస్తూ ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామన్నారు. అనంతరం వేమనపల్లి రైతు వేదికలో రుణమాఫీ యాప్ నమోదు వివరాలను పరిశీలించారు. ఆమె వెంట ఏవో వీరన్న, ఏఈవోలు రుక్సార్ సుల్తానా, హెప్సీబా ఉన్నారు.



పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ సురేఖ



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్‌లో మాట్లాడుతున్న అధికారులు

# జైనూర్‌లో పటిష్ట భద్రత

- పోలీసుల అదుపులో మండల కేంద్రం
- జైనూర్‌తో పాటు ఏజెన్సీ మండలాల్లో 144 సెక్షన్
- సంయమనం పాటించాలి : అదనపు డీజీ మహేశ్ భగవత్

మంచిర్యాల, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆదివాసీ మహిళపై జరిగిన దాడి నేపథ్యంలో ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో చోటు చేసుకున్న పరిస్థితులను పోలీసులు అదుపులోకి తీసుకొస్తున్నా రు. కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో పాటు అడిషనల్ డీజీ(లాఅండ్ఆర్డర్) మహేశ్ భగవత్, నార్త్ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం, బాలానగర్ డీసీపీ(ఆసిఫాబాద్ పాత ఎస్పీ) సురేశ్‌కుమార్ జైనూర్‌లోనూ ఉంటూ పరిస్థితులను సమీక్షిస్తున్నారు. దాదాపు 1000 మంది ప్రత్యేక పోలీసు బలగాలతో జైనూర్‌లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. జైనూర్‌లో 48 గంటలు, ఏజెన్సీ మండలాలైన ఇంద్రవెల్లి, నార్నూర్, ఉట్నూర్, గాదిగూడ మండలాల్లోనూ 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. జైనూర్‌లోని ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం పెద్దలు, నాయకులు, అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు.

## అందరూ సంయమనం పాటించాలి

- అదనపు డీజీ మహేశ్ భగవత్, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆదివాసీ మహిళపై దాడి జరగడం బాధాకరమని, ఈ ఘటనపై ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని అదనపు డీజీ మహేశ్ భగవత్, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రెస్‌నోట్‌ను రిలీజ్ చేశారు. బాధిత కటుంబానికి ప్రభుత్వం అండగా ఉందని, వైద్య ఖర్చులను భరిస్తుందన్నారు. జైనూర్ ఘటనలో జరిగిన ఆస్తి నష్టంపై పూర్తిస్థాయి నివేదిక అందించేందుకు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించామన్నారు.

# మంచిర్యాల - అంతర్గాం మధ్యే బ్రిడ్జి నిర్మించాలి

- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు
- సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ



విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను చూపిస్తున్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 5 : మంచిర్యాల-అంతర్గాంల మధ్యనే గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మించాలని, ఈ బ్రిడ్జి నిర్మిస్తేనే ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. గురువారం మంచిర్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ బ్రిడ్జి మంజూరు చేసి నిధులు విడుదల చేశారని, టెండరు ప్రక్రియతో పాటు సాయిల్‌టెస్టింగ్ పనులు కూడా పూర్తయ్యాయన్నారు. ఇరువైపులా గోదావరి నదివరకు రోడ్ల నిర్మాణం సైతం పూర్తయి ఉన్నాయని, ఎక్కువ మొత్తంలో భూసేకరణ కూడా అవసరం లేదని, రూ. 164 కోట్లతో ఈ వంతెన పూర్తవుతుందని పేర్కొన్నారు. కానీ స్థానిక ఎమ్మెల్యే మాత్రం ఈ వంతెన స్థలాన్ని మార్చాలని ప్రయత్నిస్తున్నారని, ముల్కల గ్రామం మీదుగా గోదావరిపై అవతలకు ఉన్న ముర్మూర్ గ్రామం వైపు నిర్మించాలని చూస్తున్నారని, దీంతో వంతెన వ్యయం దాదాపు రూ. 450 కోట్లు అవుతుందని, వందలాది ఎకరాల స్థలాన్ని సేకరించాల్సి వస్తుందన్నారు. ఇంతచేసినా కేవలం ఐదు కిలోమీటర్ల దూరం మాత్రమే తగ్గుతుందన్నారు. కేవలం తన మాట చెల్లుబాటు కావాలనే ఉద్దేశంతో ప్రజలకు అంతగా ఉపయోగం కాని చోట బ్రిడ్జి నిర్మించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. మంచిర్యాల-అంతర్గాంల మధ్య బ్రిడ్జి నిర్మిస్తే పెద్దపల్లి జిల్లా కేంద్రానికి 18 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని, దీంతో వాహనదారులకు చాలా సమయం ఆదా అవుతుందని, ఇంధన భారం కూడా తగ్గుతుందని చెప్పుకొచ్చారు. దీనిని మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లా ప్రజలు నూటికి నూరు శాతం కోరుకుంటున్నారని, కావాలంటే ఈ బ్రిడ్జి నిర్మాణం విషయంలో ప్రజలనుంచి అభిప్రాయం కూడా తీసుకోవాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుకు ముందు నుంచి మంచిర్యాల వాసులంటే ఇష్టం లేదని, గతంలో మంచిర్యాల కాకుండా బెల్లంపల్లిని జిల్లా చేయాలని వ్యాఖ్యానించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మంచిర్యాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, నాయకులు తోట తిరుపతి, శ్రీపతి వాసు, సాగి వెంకటేశ్వర్‌రావు, గట్టయ్య, సుధీర్, సుంకరి రమేశ్, పడాల రవీందర్, తాజుద్దీన్, దగ్గుల మధు, కాటం రాజు, హాజీపూర్ మండల అధ్యక్షులు మొగిలి శ్రీనివాస్, మందపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్

# గురువులే మార్గనిర్దేశకులు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

నస్పూర్, సెప్టెంబర్ 5 : గురువులే మార్గ నిర్దేశకులని, విద్యార్థులను సన్మార్గంలో నడిపించి వారికి భవిష్యత్‌నిచ్చేది వారేనని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఈవో యాదయ్య, జడ్పీసీఈవో గణపతి, వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, జిల్లా మైనార్టీ అధికారి రాజేశ్వరితో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్వేపల్లి జయంతి సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఉత్తమ సేవలందించిన 43 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# అగ్నిమాపక సిబ్బందికి పొంచిఉన్న ప్రమాదం

- శిథిలావస్థలో ఫైర్‌స్టేషన్
- భయం భయంగా విధులు

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 5 : ఆపత్కాలంలో ఆదుకునే అగ్నిమాపక సిబ్బందికి ప్రమాదం పొంచి ఉన్నది. కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్ఆర్‌వో కాలనీలోగల ఫైర్‌స్టేషన్ (పురాతన షెడ్డు) శిథిలమై ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సిబ్బంది నిత్యం భయం భయంగా విధులు నిర్వహించాల్సి వస్తున్నది. గోడలు పగుళ్లు తేలి అందులో నుంచి పాములు వస్తున్నాయంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. ఎమర్జెన్సీలో సమయంలో అగ్నిమాపక వాహనంలో నీరు నింపుకుందామంటే కనీసం బోర్‌వెల్ కూడా లేదు. గత నెల 30న వేకువజామున కారు ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక వాహనం బయలుదేరగా, స్థానికంగా బురదలో దిగబడిపోయింది. రెండు డ్రైవర్ పోస్టులు, మూడు ఫైర్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇకనైనా సర్కారు స్పందించి కొత్త భవనం మంజూరు చేయడమేగాక, సౌకర్యాలు కల్పించాలని, పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలమైన షెడ్డులో అగ్నిమాపక కేంద్రం

# ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- జైనూర్‌కు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

ఆసిఫాబాద్ టౌన్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 5 : అమాయక ఆదివాసీ మహిళపై జరిగిన అఘాయిత్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జైనూర్‌లో జరిగిన ఘటన గురించి తెలుసుకునేందుకు వెళ్తుండగా కెరమెరి ఘాట్ వద్ద ఆమెను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఒక ఆదివాసీ మహిళనైన తనను అడ్డుకోవడమేమిటని ప్రశ్నించారు. అయినా పోలీసులు అనుమతించకపోవడంతో తిరిగి ఆసిఫాబాద్‌లోని తన నివాసానికి చేరుకొని విలేకరులతో మాట్లాడారు.



ఎమ్మెల్యే కోవ లక్ష్మిని అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్ గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న బాధిత మహిళను కలిశానని, ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరానని తెలిపారు. ఆమెవెంట నాయకురాలు మర్సుకోల సరస్వతి ఉన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

# గర్భిణులు, బాలింతల సంక్షేమంపై శ్రద్ధ పెట్టాలి

## మంచిర్యాల కలెక్టర్‌కుమార్ దీపక్

నస్పూర్, సెప్టెంబరు 5 : పోషణ్ అభియాన్ ద్వారా పోషణ లోపాన్ని అధిగమించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణి, డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, జడ్పీసీఈవో గణపతి, వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్‌తో కలిసి ఈ నెల 30న వరకు తలపెట్టిన పోషణ్ మాహ్-2024 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారంపై గ్రామపంచాయతీ కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పిల్లలకు కథల పుస్తకాలు అందించి చదవడంపై ఆసక్తి పెంచాలని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవోలు విజయలక్ష్మి, రేష్మ, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త రజిత, ఉమెన్ హబ్ టీం, సూపర్ వైజర్లు, డీపీఏలు, మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# ఐదు నెలలుగా వేతనాల్లేవు

- ఆర్థిక ఇబ్బందుల్లో మిషన్ భగీరథ సిబ్బంది
- అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన దుస్థితి
- గ్రామాలకు నీటి సరఫరాపై ప్రభావం
- స్పందించని సర్కారు

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : మిషన్ భగీరథ క్షేత్రస్థాయి సిబ్బంది ఐదు నెలలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నది. నీటి సరఫరాలో నిరంతరం కష్టపడే వీరికి సకాలంలో జీతాలు రాక అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కుమ్రం భీం ప్రాజెక్టు నుంచి జిల్లాలోని 15 మండలాలతో పాటు ఆదిలాబాద్ జిల్లాలోని ఐదు మండలాలు, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పరిధిలోని మూడు మండలాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్నది. వాల్ ఆపరేటర్లు, ఫిట్టర్లు, సూపర్‌వైజర్లు ఇలా సుమారు 600 మంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. వీరికి రూ. 10 వేల నుంచి రూ. 12 వేల వరకు వేతనాలుంటాయి.

### కేసీఆర్ సర్కారులో..

ఇంటింటికీ నీరందించే లక్ష్యంతో తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకాన్ని కేసీఆర్ సర్కారు విజయవంతంగా అమలు చేసింది. ప్రతి నెలా సకాలంలో జీతాలు అందించింది.ఎక్కడా నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తలేదు. కానీ.. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత మిషన్ భగీరథ నిర్వహణ గాడి తప్పింది. సిబ్బందికి వేతనాలు ఇవ్వకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. అనేక గ్రామాలకు తాగు నీరు సరఫరాకాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు సకాలంలో వేతనాలు అందించాలని మిషన్ భగీరథ క్షేత్రస్థాయి సిబ్బంది కోరుతున్నారు.

### జీతాలు రావట్లే



మాకు ఐదు నెలలుగా జీతాలు రావట్లేదు. రాత్రీ.. పగలూ పనిచేసి తాగు నీరు సరఫరాలో ఇబ్బందుల్లేకుంట చూస్తున్నం. ఇంత కష్టపడ్డా ఫలితం లేకుంటైతంది. కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్నం. ఇకనైనా సర్కారు స్పందించి సకాలంలో జీతాలు ఇవ్వాలి.

- చాపిడి బాలేశ్, వాల్ ఆపరేటర్, ఆసిఫాబాద్

### అసలే జీతం తక్కువ



కుమ్రం భీం ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యే గ్రామాల పరిధిలో దాదాపు 600 మంది సిబ్బంది పనిచేస్తున్నరు. మాకు ఇచ్చే జీతం కూడా తక్కువే. గా డబ్బులు కూడా నెల నెలా ఇవ్వడం లేదు. ఐదు నెలలుగా అవస్థలు పడుతున్నం. ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

- మాచరాల బుద్ధయ్య, ఆపరేటర్, కెరమెరి

# వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

## మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్

హాజీపూర్, సెప్టెంబర్ 5 : వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో హరీశ్ అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టిక, ఔట్ పేషెంట్స్ నమోదు రిజిస్టర్, మందుల నిల్వల రిజిస్టర్, ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో పర్యటించాలని, ఎప్పటికప్పుడు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య కార్యక్రమాల్లో జిల్లాను ముందంజలో ఉంచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు లహరి, డెమో వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో జయమేరి, హెచ్ఈవో రఘుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

### వైద్యశిబిరం సందర్శన

బెల్లంపల్లి, సెప్టెంబర్ 5 : సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని నం-2 ఇంక్లైన్ బస్తీలో అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. బస్తీల్లో ఏర్పాటు చేసే శిబిరాల్లో బీపీ, షుగర్ పరీక్షలు చేస్తామని, రక్తపరీక్షల కోసం అర్బన్ హెల్త్ సెంటర్, వంద పడకల దవాఖానకు వెళ్లాలని సూచించారు. వైద్యులు సౌజన్య, జుబేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 77 మందికి పరీక్షలు చేశారు. అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు.



గురువులతో 1970- 71 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు

# 54 ఏళ్లకు ఒకేచోట చేరి..

## చెన్నూర్ ప్రభుత్వ పాఠశాలలో అపూర్వ సమ్మేళనం

చెన్నూర్ టౌన్, సెప్టెంబర్ 5 : చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1970-71 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా గురువారం ఒకేచోట కలుసుకున్నారు. పట్టణంలోని ఎస్ఎస్ఆర్ ఫంక్షన్‌హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. బాగోగులు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. పలు కార్యక్రమాలు నిర్వహించి రోజంగా ఆనందంగా గడిపారు. ప్రాథమిక, సెకండరీ స్థాయిలో చదువు చెప్పిన గురువులు వారణాసి చంద్రయ్య, పులి రామన్న, బోద్ చంద్రయ్య, అడ్వాల లచ్చయ్య, సయ్యద్ సాదీఖ్ అలీలను పూలమాలలు, మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పురాణపు శంకర్, టంకసాల రవీందర్, రుద్రభట్ల రాజారాం, మహవాది రమేశ్, గన్ను పురుషోత్తం, శ్రీరాములు, డా.సుడిగాల రవీంద్రనాథ్ సూరి, కసోజ్జల కమలాకర్, నాగోతు సత్యనారాయణ, రాజేశ్వర్ రెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

# సంయమనం పాటించాలి

దండేపల్లి, సెప్టెంబర్ 5 : అన్ని వర్గాల ప్రజలు సంయమనం పాటించాలని రామగుండం సీపీ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని మేదరిపేటలో పర్యటించారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మొద్దన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నరేందర్, ఎస్ఐ ఉదయ్‌కిరణ్, సిబ్బంది ఉన్నారు.

### సంచార గ్రంథాలయం ద్వారా పుస్తకాల ప్రదర్శన



సంచార గ్రంథాలయం వద్ద అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

దండేపల్లి, సెప్టెంబర్ 5 : మండలంలోని పలు గ్రామాల్లో రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంచార గ్రంథాలయ వాహనం ద్వారా పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నది. దండేపల్లి మండల కేంద్రంలో గురువారం సంచార గ్రంథాలయం ద్వారా పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూమ్ టూరీడ్ ఎల్ఎఫ్ మహేశ్, సీఆర్పీ నర్సయ్య ఉన్నారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679